## క్లుప్తంగా

### నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



పురుగు మందులను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే విక్రయించాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. కొనుగోలు దారులకు తప్పనిసరిగా రషీదు ఇవ్వాలని, ధరలు, నిల్వల బోర్డు ప్రదర్శించాలని ఈ సందర్భంగా ఏఓ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: హౌసింగ్ కాలనీలలో వివిధ నిర్మాణ దశలలో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఎంపీడీఓ శకుంతల తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ఉపాధి అధికారులు, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణాలపై నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. హౌసింగ్ కాలనీ లేవుట్‌లు, లబ్ధిదారులు సొంత స్థలాల్లో నిర్మించుకుంటున్న గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాల్లో ఉపాధి పథకంలో భాగంగా చేపట్టిన పనిదినాల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు వెంటనే వారి ఖాతాలకు జమ అయ్యేలా చూడాలని ఇంజినీర్ అసిస్టెంట్లకు సూచించారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత లక్ష్యాలతో చదవాలి



మోడల్ స్కూల విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదువాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ప్రిన్సిపల్ వంశీమోహన్‌తో తహసీల్దార్ మాట్లాడి విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆమె విద్యార్థినులతో ముచ్చటించారు. సమస్యలపై ఆరా తీశారు. శ్రద్ధగా చదివి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థినులకు తహసీల్దార్ సూచించారు.

### సన్మానం



తహసీల్దార్ ఫణికుమార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

పాణ్యం: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ ఫణికుమార్‌ను బుధవారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉద్యోగులు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందజేశారని ఈ సందర్భంగా తహసీల్దార్ అభినందనలు తెలిపారు.

### గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం

ఓర్వకల్లు: మండలంలో నిర్దేశించిన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందజేస్తుందని ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు. బుధవారం ఉన్నత భారత్ అభియాన్ కింద ఎంపికైన కన్నమడకల, కేతవరం, ఓర్వకల్లు గ్రామాలలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ డెవలప్‌మెంట్ మిషన్(ఐఐటీడీపీ) ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆ సంస్థ విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించి ఆయా గ్రామాల సమస్యలను గుర్తించి పంపిస్తారని ఎంపీడీఓ తెలిపారు. సర్వే ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు.

# ఉల్లి సాగుకే రైతన్న మొగ్గు!

- రెండేళ్లుగా నష్టపోయినా... విస్తారంగా ఉల్లి సాగు చేస్తున్న వైనం
- నారుకు, వ్యవసాయ కూలీలకు పెరిగిన డిమాండ్
- గతేడాది పరిహారం అందజేసి ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



వర్కూరులో బోరు కింద సాగు చేసిన ఉల్లి పంట



వెంకటగిరి గ్రామంలో ఉల్లి నాట్లు వేస్తున్న కూలీలు



ప్యాలకుర్తి సమీపాన అమ్మేందుకు బోర్ల కింద సాగైన ఉల్లి నారు

కోడుమూరు రూరల్ : ఉల్లి సాగుకే రైతన్న మొగ్గు చూపుతున్నాడు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అదేపరిస్థితి నెలకొంది. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, దేవనకొండ, ఆలూరు, ఆస్పరి, మద్దికెర, కోసిగి, తుగ్గలి ప్రాంతాల్లో ఉల్లిసాగు విస్తారంగా చేపట్టారు రైతులు. బోరు బావులతో పాటు, వర్షాధారం కింద రైతులు జోరుగా సాగు చేస్తున్నారు. ప్రత్యేకించి కోడుమూరు నియోజకవర్గంలో ఉల్లి నాటు పనుల్లో రైతులు బిజీబిజీ అయ్యారు. గతేడాది కోడుమూరు నియోజకవర్గంలో ఐదువేల ఎకరాల్లో ఉల్లి సాగు చేయగా, ఈయేడు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే వర్షాభావ పరిస్థితులు మరోవిధంగా ఉన్నాయి. జూన్ 1వ తేదీన ఖరీఫ్ సీజన్ ప్రారంభమవ్వగా వర్షాలు సైతం అనుకూలంగా కురిశాయి. అయితే అనంతరం దాదాపు నెలన్నరపాటు వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది, సజ్జ, పత్తి, వేరుశనగ, జనుము తదితర పంటలు వాడుపట్టాయి. ప్రత్యేకించి ముంగారు కొర్ర పూర్తిగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు వాడిన పంటలకు జీవం పోశాయి. అయితే ముంగారు కొర్రకు మాత్రం ఉపయోగపడలేదంటున్నారు రైతులు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురువడంతోపాటు ఉల్లికి మంచి గిట్టుబాటు ధర ఉండడంతో ఆ పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఉల్లి క్వింటాం రూ.2,400 నుంచి రూ.2,500 వరకు పలుకుతోంది.

**ఉల్లి నారకు పెరిగిన డిమాండ్**

ఒక్కసారిగా రైతులు ఉల్లి సాగువైపు మొగ్గు చూపుతుండడంతో నారుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. రెండు వారాల కిందటి వరకు రూ.2,000 పలికిన ఒక ఉల్లి బెడ్డు ప్రస్తుతం రూ.3,000 వరకు పెరిగింది. అయినప్పటికీ రైతులు పోటీపడి ఉల్లి నారను కొనుగోలు చేస్తున్నారు. ఒక ఎకరాలో ఉల్లి నాటు కోవాలంటే ఆరు నుంచి ఏడు బెడ్ల వరకు నారు అవసరమవుతోంది. అదేవిధంగా వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది. వానల్లేకపోవడంతో గత వారం కిందటి వరకు పనుల్లేక అల్లాడిన కూలీలు వర్షాల రాకతో బిజీ అయ్యారు. దీనికితోడు ఉల్లి నాట్లు జోరుగా సాగుతుండడంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రోజుకూలీ రూ.300 నుంచి రూ.350 వరకు కూలీలకు కూలి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా కూలీల కొరత ఏర్పడుతోంది.

### గతేడాది ఉల్లి రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితుల మూలంగా ఉల్లి రైతులు నష్టపోతూనే ఉన్నారు. కోడుమూరు నియోజకర్గంలో యేటా దాదాపు ఐదువేల ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేస్తారు. అయితే సరైన సమయంలో వర్షాలు కురవక నష్టపోయారు. దిగుబడులు సగానికి సగం తగ్గిపోవడంతోపాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉల్లి రైతులకు అండగా నిలిచింది. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకుంది. దీంతో రైతులు నష్టాల నుంచి కొంతమేర కోలుకున్నారు.

**ఉల్లి సాగులో వెంకటగిరి రైతులు ప్రత్యేకం**

ఉల్లి సాగులో వెంకటగిరి రైతులు ప్రత్యేకమనే చెప్పాలి. జిల్లాలో ఎక్కడా లేనంతగా ప్రతియేటా ఈ గ్రామంలో వర్షాధారం కింద ఉల్లిని విస్తారంగా సాగు చేస్తారు. కోడుమూరు నియోజకర్గం మొత్తం కలిపితే ఈ గ్రామంలోనే మూడవ వంతు ఉల్లి సాగు అవుతుంది. ప్రస్తుతం కేవలం వారం రోజుల్లోనే దాదాపు వెయ్యి ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు వెంకటగిర రైతులు. నాట్ల కోసం ఇతర గ్రామాల నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు.

### పదిహేను ఎకరాల్లో సాగు చేస్తున్నా..



వర్షాధారం కింద ఈ ఏడాది 15ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేస్తున్నా. ఎకరాకు ఉల్లి నార, కూలీలతో కలిపి సుమారు రూ.30వేల వరకు ఖర్చు పెట్టా. గతేడాది కూడా 15ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసి నష్టపోయినప్పటికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకుంది. వర్షాలు కురుస్తున్నందు నమ్మకంతో మళ్లీ ఉల్లి సాగు చేస్తున్నా. అంతా కలిసొస్తే దిగుబడులు బాగుంటాయి. గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకం ఉంది. ఆపై దేవుడి దయ.

– రైతు మహేశ్వరరెడ్డి, వెంకటగిరి

### విస్తారంగా ఉల్లి సాగు చేస్తున్నారు...



ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఎక్కువ మంది రైతులు ఉల్లి సాగుకే మొగ్గు చూపుతున్నారు. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో సుమారు 5వేల ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేస్తున్నారు. కోడుమూరు మండలంలోని వెంకటగిరి గ్రామంలోనే రెండువేల ఎకరాల్లో రైతులు వర్షాధారం కింద ఉల్లి సాగు చేసే అవకాశం ఉంది.

– మదన్ మోహన్, హార్టికల్చర్ ఆఫీసర్, కోడుమూరు

## సి.బెళగల్‌లో గ్రామసభ



గ్రామ సభలో మాట్లాడుతున్న పీఎస్ సునీల్ రాణి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ ఒకటవ సచివాలయంలో బుధవారం సర్పంచ్ పాండురంగన్న అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి గ్రామ సభ నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై తీసుకుంటున్న చర్యలు సునీల్ రాణి వివరించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందుని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సర్పంచ్ సూచించారు. కుష్టు వ్యాధి లక్షణాలు వివరించిన జిల్లా ఐఈసీ సమన్వయకర్త లక్ష్మినారాయణ,హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ ఏ మాత్రం అనుమానం ఉన్నా పీహెచ్‌సీలో సంప్రదించాలని తెలిపారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామ సచివాలయాన్ని బుధవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, కార్యాలయ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

**పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో బుధవారం తహసీల్దార్ అనుపమ పర్యటించారు. పారిశుద్ధ్య సమస్యలను పరిశీలించారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తహసీల్దార్ సూచించారు.

## పరిసరాల శుభ్రత పాటించండి



గూడూరులో మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ శేషిరెడ్డి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి
- ఆర్డీఓ శేషిరెడ్డి

కోడుమూరు రూరల్: సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని ఆర్డీఓ శేషిరెడ్డి సూచించారు. మండల కేంద్రం గూడురులో బుధవారం ఆర్డీఓ విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల, వసతి గృహాలను ఆర్డీఓ సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆర్డీఓ మరింత నాణ్యతగా వండిపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పరిసరాలు, టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి రోజు తనిఖీ నిర్వహించి నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఎంఈఓ సునీలమ్మను ఆర్‌డీఓ ఆదేశించారు. అనంతరం పడమర బీసీ కాలనీలోని పంప్‌హౌస్‌ను ఆర్డీఓ పరిశీలించారు. ప్రజలకు శుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వీధులను శుభ్రం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ దివాకర్ రెడ్డిని ఆదేశించారు. పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు.

### సోలార్ పనులు అడ్డుకున్న రైతులు

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో జరుగుతున్న సోలార్ పరిశ్రమ పనులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. తమ భూములకు పరిహారం అందించాలని, గ్రామానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతులు కోరారు. అలాగే స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పనులు జరుగునివ్వమని రైతులు హెచ్చరించారు.

## సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

- పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల ప్రమాదాన్ని వివరించి ఆరోగ్య సూత్రాలు పాటించేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. మండలంలోని ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, పూడిచెర్ల, కేతవరం గ్రామాలలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా గ్రామాలలో కలియతిరిగిన పీడీ పరసరాల శుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. రోడ్లపై నీటి నిల్వ ఉండకుండా చూడాలని, మురుగు కాల్వలల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలింపు చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మురుగు నిల్వ మూలంగా దోమల ఉత్పత్తి జరుగుతుందని, మలేరియా, అతిసార, టైఫాయిడ్, డెంగీ తదితర విషజ్వరాలు విజృంభిస్తాయనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, తహసీల్దార్ నటరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### ఆధార్ క్యాంపు సేవలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ క్యాంప్ సేవలను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ రవికిషోర్

కల్లూరు: ఆధార్ ప్రత్యేక క్యాంపుల సేవలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని ఈఓఆర్డీ రవికిషోర్ సూచించారు. బుధవారం బొల్లవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ సున్నా నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నంబర్ లింక్, బయోమెట్రిక్ అథన్‌టికేషన్ తదితర మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలో 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపుల్లో మార్పు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్, ఇ–మెయిల్ ఐడీ లింక్, బయోమెట్రిక్(ఫొటో,ఐరిష్, ఫింగర్ ప్రింట్) అప్డేట్ చేస్తారన్నారు. అదేవిధంగా పేర్లు, పుట్టిన తేదీ, జెండర్, ఆధార్ డాక్యుమెంటేషన్, చిరునామా తదితరాలు ధృవీకరణ పత్రాలు సమర్పించి మార్పు, చేర్పులు చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పదేళ్లకోసారి తప్పనిసరిగా ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తడకనపల్లె గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మజార గ్రామాలైన ఓబులాపురం తండా, వామసముద్రం గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. రోడ్డు వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సహెరబీ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

### ఉద్యాన రైతులకు ప్రోత్సాహం



రైతులకు మొక్కలు అందజేస్తున్న ఏపీడీ లక్ష్మన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు : ఉపాధి పథకం కింద ఉద్యాన రైతులను ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఏపీడీ లక్ష్మన్న తెలిపారు. మండల వ్యాప్తంగా 40 మంది రైతులకు బుధవారం వివిధ రకాల 4,086 మొక్కలను అందించారు. నెరవాడ, సల్కాపురం, ఎ.గోకులపాడు, కె.మార్కాపురం,బస్తిపాడు, పుసులూరు, తడకనపల్లె, చెట్లమల్లాపురం, పెద్దటేకూరు తదితర గ్రామాల రైతులకు కొబ్బరి, జామ, మామిడి, సీతాఫలం, నెరేడు తదితర మొక్కలను ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఏపీడీ అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, ఈసీ మధు సూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసుల దాడులు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కోడుమూరు రూరల్: క్రిష్ణగిరి మండలంలోని చిట్యాల నుంచి కటారుకొండకు వెళ్లేదారిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలపై కోడుమూరు సెబ్, కర్నూలు స్క్వాడ్ పోలీసులు బుధవారం మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అంతకు ముందు వెల్దుర్తిలో నాగమద్దమ్మ, లక్ష్మిదేవమ్మను అదుపులోకి తీసుకుని వారి నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వారిని డోన్ కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో సెబ్ సీఐ రామాంజినేయులు, కర్నూలు స్క్వాడ్ సీఐ నరసనాయుడు, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ● విస్తారంగా ఉల్లి సాగు



బస్తిపాడులో ఉల్లినార నాటుతున్న కూలీలు

కల్లూరు: మండలంలో రైతులు విస్తరంగా ఉల్లి సాగు చేస్తున్నారు. గతేడాది కంటే అధికంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉల్లిసాగు కానుంది. కె.మార్కాపురం, పెద్దకొట్టాల, బస్తిపాడు, లక్ష్మీపురం, ఎ.గోకులపాడు, పుసులూరు, రెమడూరు గ్రామాల్లో రైతులు అత్యధికంగా ఉల్లి సాగు చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 600 హెక్టార్లు ఉల్లి సాగు చేయగా, ఈ ఏడాది 1,000 హెక్టార్లలో సాగయ్యే అవకాశ ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని 18,19,20వ వార్డుల్లో నెలకొన్న సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీల వాసులు బుధవారం మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు రాజు, కాలనీవాసులు మధు, వెంకట్, రామాంజినేయులు మాట్లాడారు. వార్డులు వర్షపు నీటితో బురదమయంగా మారాయని, రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.